క్లుప్తంగా

కష్టాల్లో పార్టీ అండగా ఉంటుంది



ప్రమాదానికి గురైన దుర్గారావును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, రేషన్ వ్యాన్ డ్రైవర్ల అసోసియేషన్ నాయకుడు దుర్గారావు ప్రమాదంలో గాయపడడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శనివారం దుర్గారావును పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తొత్తడి వేదకుమారి, కట్ట ఏసుబాబు, యువజన విభాగం దెందులూరు మండల అధ్యక్షుడు గోరిపర్తి శ్రీనివాసరావు ,సీనియర్ నాయకులు సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు, చల్ల మేరీ రాజు, మురళి, వన్నెకూటి సుందరం, బల్ల విజయకుమార్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నాయకుల పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త టేకి శ్రీనివాస్‌ను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి సీతమ్మ(75) ఇటీవల మరణించింది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించిన ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, బూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వై.పాపారావుబాబ్జి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ బాలకృష్ణ, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఉంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు సందక రాంబాబు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద జయలక్ష్మి, దూసనపూడి లక్ష్మీనారాయణ, రంగు వెంకటేశ్వరరావు, గంటా సుబ్బారావు, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు టీకాలతోనే భవిష్యత్



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్ల లోపు వారందరికీ విధిగా తల్లిదండ్రులు టీకాలు వేయించాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజు మేరీ అన్నారు. శనివారం గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలో సబ్ సెంటర్‌లో చిన్నారులకు టీకాలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోకుండా నిర్లక్ష్య వైఖరితో ఉంటే చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్యంతో పాటు తమ తమ ఆరోగ్యాల సంరక్షణలో కూడా వ్యక్తిగత బాధ్యతలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందికి తల్లిదండ్రులు అన్ని గ్రామాల్లో ప్రజలు సహకరించాలని వైద్యులు కోరారు. దెందులూరు సబ్ సెంటర్‌లో ఏఎన్ఎం సుభాషిణి, వైద్య సిబ్బంది టీకాలు చిన్నారులకు వేశారు.

ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలి



కరపత్రం విడుదల చేస్తున్న ఫాదర్ ఆంథోని

ఏలూరు (టూటౌన్): ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని కతోలి ఎస్సీ, బీసీ కమిషన్ కార్యదర్శి ఫాదర్ ఆంథోని డిమాండ్ చేశారు. ఆగస్టు ఏడో తేదీన నిర్వహించే రాష్ట్రపతి ఆర్డినెన్స్‌పై శనివారం సాయంత్రం స్థానిక నరసింహారావుపేటలోని ఎస్‌సీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆంథోని మాట్లాడారు. రాష్ట్రంలో, ఈ దేశంలో ఎస్సీలను అలాగే, ఎస్సీ క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని గత దశాబ్దాలుగా చేస్తోన్న పోరాటానికి నేటికీ పరిష్కారం దొరకని పరిస్థితి ఉందన్నారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఎస్సీలు, ఎస్సీ క్రైస్తవులతో భారీ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీలు, ఎస్సీ క్రైస్తవులపై నిత్యం దాడులు జరగడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరపత్రం విడుదల చేశారు.

గ్రామాల్లో సాగు సందడి

వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం



కాగుపాడు ఆయకట్టులో ట్రాక్టర్లతో దమ్ము చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గ్రామాల్లో సాగు సందడి మొదలైంది. మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏకకాలంలో ఓ వైపు నారమడులు ఎదుగుతుండగా మరో వైపు అందివచ్చిన నారుతో నాట్లు పనుల్లో రైతులు, రైతు కూలీలు నిమగ్నమయ్యారు. కొందరు రైతులైతే దమ్ములు, గట్టులంకలు, ఆకుతీత, దమ్ముల పనులు చేయిస్తున్నారు. బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు పొలాలు వద్దనే మకాం ఉండి నాట్లు వేసే పనులు సాగిస్తున్నారు. ఏలూరు జిల్లాలో అత్యధికంగా వరి పంట వేసే మండలంలో ఉంగుటూరు ఒకటి. మండలంలో 24 వేల ఎకరాలలో వరి సాగు వేస్తున్నారు. ఇప్పటికి నాట్లు మొదలుపెట్టి నాలుగు వేలు ఎకరాల్లో పూర్తి చేశారు. స్వర్ణ, సంపత్ స్వర్ణ, పీఎల్‌ఏ 1100 రకాలు ఈ ఏడాది సార్వాలో సాగు చేస్తున్నారు.

విత్తన శుద్ధి, సస్యరక్షణే కీలకం

- రైతులు తమ పంట పొలాల్లో వరి బాగుండడం కోసం విత్తన శుద్ధి చేస్తే పంట మీద చీడ పీడలు ఆశించకుండా ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.
- కిలో విత్తనానికి 2.5 గ్రాములు కార్బండిజమ్ కలిపి 24 గంటలు తరువాత నారుమడిలో వెదజల్లాలి.
- దుంప నారుమడులకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి మొలకలను దుంప నారుమడిలో చల్లుకోవాలి.
- కిలో విత్తనాలను నానబెట్టడానికి లీటరు మందు నీళ్లు సరిపోతుంది.
- పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలుపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేయాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారుపోయడానికి వాడుకోవాలి.
- మడిలో చల్లే ముందు 24 గంటలపాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి.
- విత్తనాలద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనాలకు మూడు గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.
- నారుమడిలో చల్లేముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2 శాతం క్లోరిపైరిపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకు తినే పురుగులు ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.
- అలాగే నాట్లు వేసే సమయంలో నారు కొసలు తుంచడం వల్ల తల్లి పురుగులు గుడ్లును కోసల మీద పెడుతుంది. కాబట్టి నారు నాటేటప్పుడు కొసలు విరిచి నాటాలి. తద్వారా గుడ్లను నిర్మూలించవచ్చు.



ఉంగుటూరు ఆయకట్టులో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



కాగుపాడులో గట్లు లంకలు వేస్తున్న రైతు



యర్రమళ్లలో నారుమడి నుంచి నారు పీకుతున్న కూలీలు

సాయిబాబా ఆలయానికి రావాలని ఎస్పీకి ఆహ్వానం



ఎస్పీని ఆహ్వానిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ వడ్లపట్ల శ్రీనివాసరావు

దెందులూరు: మండలంలోని కొవ్వలిలో సాయిబాబా ఆలయానికి రావాల్సిందిగా జిల్లా ఎస్పీ కే.ప్రతాప శివకిషోర్‌ను దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వడ్లపట్ల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఎస్. సుధాకర్ ఆహ్వానించారు. జిల్లా ఎస్పీని నాయకులు ఆయన కార్యాలయంలో కలిసి పుట్టపర్తి సాయిబాబా మాజీ గవర్నర్లు సుర్జిత్ సింగ్ బర్నాల, వీఎస్ రమాదేవి, కేంద్ర మంత్రులు ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు వివిధ రంగాల ప్రముఖులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారని ఎస్పీకి వివరించారు. త్వరలోనే సాయిబాబాను దర్శించుకొంటానని ఎస్పీ తెలిపారని ప్రజాప్రతినిధులు తెలిపారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

గణపవరం: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గణపవరంలో పేదలు, వలస కుటుంబాల వారికి అల్పాహారం అందించారు. సంతమార్కెట్, బొబ్బిలివంతెన, సాయిబాబా ఆలయం తదితర ప్రాంతాలలో ఉన్న పేదలు, బిచ్చగాళ్లు, వలస కుటుంబాలకు చెందిన వ్యక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్, కార్యదర్శి కిలారి రవి, కోశాధికారి కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే దోమల నియంత్రణ



డెంగీపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్, మలేరియా సబ్‌డివిజన్ అధికారి పి.ప్రసాద్ అన్నారు. శనివారం పీహెచ్‌సీలో డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవడం మంచిదని, ఒకవేళ డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స పొందితే వ్యాధి నుంచి బయట పడవచ్చన్నారు. దోమల ద్వారానే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమల నిర్మూలన ప్రభుత్వ బాధ్యత అని నిర్లక్ష్యం చేయకుండా అందరూ దోమల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. పరిసరాల్లో తడి, నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. జూలై నెలాఖరు వరకూ డెంగీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ హక్కుల పరిరక్షణే లక్ష్యం



సభ్యత్వ నమోదు చేసుకున్న ముస్లిం సోదరులు

దెందులూరు: ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సంస్థ లక్ష్యమని వారి సమస్యలు పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా జమీ అత్ ఉలమా సంస్థ కృషి చేస్తుందని తద్వారా సభ్యత్వ నమోదు చేస్తున్నామని జమీ అత్ ఉ లామా రాష్ట్ర కన్వీనర్ మౌలానా హాఫిజ్ హుస్సేన్‌అహ్మద్ తెలిపారు. తమ సంస్థకు దేశవ్యాప్తంగా 125 మిలియన్ల సభ్యులు ఉన్నారన్నారు. శనివారం దెందులూరు మండలం సోమవరప్పాడులోని జాతీయ రహదారి పక్కన మసీదులో జమీ అత్ ఉలామా జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు హాఫిజ్ నూరుల్ హక్, మదర్సా, నిర్వాహకులు మౌలానా అబ్దుల్ హసన్, నిర్వాకులు మౌలానా లియాఖత్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లాలో 20వేల మంది సభ్యత్వ నమోదు తొలి ప్రాధాన్యత అన్నారు. ముస్లిం మైనారిటీ వర్గాల భద్రత విద్య, వైద్యం హక్కుల పరిరక్షణ కోసం సంస్థ ప్రధానంగా రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తుందన్నారు.

వరద బాధితులకు సహాయ పునరావాస కార్యక్రమాలు



దాచరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటిస్తున్న ఆర్డీఓ

కుక్కునూరు: గోదావరి వరద ముంపు ప్రమాద మండలాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని వరద ముంపు బాధితులను దాచారంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద పునరావాస శిబిరానికి తరలించి, ప్రజలకు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఆర్డీవో ఎంవీ రమణ పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. కుక్కునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వరద ప్రమాద హెచ్చరికపై టాంటాం చేస్తూ, మండలంలోని ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

మోసానికి బ్రాండ్ చంద్రబాబు

బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: బాబు మోసాన్ని ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని మోసపు హామీలతో అబద్ధపు వాగ్దానాలతో రాజకీయం ఎక్కువకాలం ఉండదని వైఎస్సార్ సీపీ దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పెదవేగి మండలం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అబ్బాయి చౌదరి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం మౌలిక వసతులు సంగతి గాలికి వదిలేసి దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులు విధింపులు, కొట్లాటలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి ఇంటింటికీ హామీల బాండ్లను పంపించి అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి వాటిని ప్రజలకు అందించకుండా చేసిన మోసాన్ని మరింత చేరువ చేయాలని అన్నారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను ఏడాదికిపైగా మోసం చేశారని విమర్శించారు. ఏం ఒరగబెట్టారని తొలి అడుగంటూ ప్రజల్లోకి వెళ్తున్నారంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఇచ్చిన హామీలను ప్రజలకు అమలుచేసే విధంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. సూపర్‌సిక్స్ అన్నావు.. బాబు ష్యూరిటీ అన్నావు, కానీ ఏడాది పాలనలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే విధంగా చంద్రబాబు ప్రజల్ని నమ్మించి అడ్డంగా మోసం చేశాడని విమర్శించారు. ప్రతి నెలా ఏదోక సంక్షేమాన్ని అందించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు గెలుచుకున్నారని, ప్రజల్ని ఎలా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసన్నారు. ఉచిత బస్సు పథకం తుస్సుమనిపించాడని, జిల్లా పరిధి వరకే ఉచిత బస్సు అంటూ ప్రకటన చేయడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేక లక్ష్మణరావు, పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట ప్రసాద్, నాయకులు మేడికొండ కృష్ణారావు బాబు, అన్ని గ్రామాల సర్పంచులు పార్టీ అధ్యక్షులు కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు, వార్డు మెంబర్లు, అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజల కోసం పోరాడాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీలో కీలక పదవుల్లో నియమితులైన నాయకులు ప్రజల కోసం చేసే పోరాటాల్లో ముందుండాలని ఆపార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పిలుపునిచ్చారు. పార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన లంకలపల్లి గణేష్ శనివారం జేపీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో భయానక వాతావరణం నెలకొందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అటువంటి సందర్భాల్లో బాధితులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలవాల్సిన అవసరం పార్టీ నాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు స్టాలిన్, పాతినివలస రాజేష్, నేతల కోటి, జంప నాగేశ్వరరావు, సూరిశెట్టి వీరస్వామి, మద్దాల ఫణి, బండ్లమూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో మాల యోధుల పాత్ర అమోఘం



సెమినార్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ ఏసీటీఓ రామారావు

ఏలూరు (టూటౌన్): భారతదేశ చరిత్రలో మాల యోధుల విశిష్టత మేధావుల పాత్ర చాలా ఘనమైనదని దళిత సాహిత్య పరిశోధక గ్రంథ రచయిత రిటైర్డ్ కమర్షియల్ ట్యాక్స్ స్టేట్ ఆఫీసర్ బొనిగల రామారావు అన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని ఓ ప్రైవేట్ పంక్షన్ హాలులో నేతల రమేష్ అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన భారత దేశ చరిత్రలో మాల యోధుల విశిష్టత, మేధావుల పాత్రపై సెమినార్‌లో రామారావు మాట్లాడారు. ప్రాచీన భారతదేశ చరిత్రలో మాలయోధులు మాల మేధావులు నిర్వహించిన పాత్ర అమోఘమైనదన్నారు. గత చరిత్రను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. చారిత్రక ఆధారాలతో పురాతన గ్రంథాల్లో ఉన్న అనేక అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, జేఏసీ చైర్మన్ చాగంటి సంజీవ్, ఏలూరు కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, పల్లెం ప్రసాద్, డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, దాసరి నాగేంద్ర కుమార్, అలుగు ఆనంద శేఖర్, ఎరికిపాటి విజయ్, కాపుదాసి రవి, గొల్ల కిరణ్, కర్ణకోటి దిలీప్, పాము రవీంద్ర, దోమతోటి అబ్రహాం, గంజి మధు, సీహెచ్ సాయిరాజ్, దాసి వెంకటేశ్వర్లు కర్రే అంబేద్కర్, గుదే రాంబాబు, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, మాదేపల్లి సర్పంచ్ కొరపాటి బాబు, తేరా ఆనంద్, పాము శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

- మరో నాలుగు రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు
- ఏలూరులో బెంబేలెత్తుతున్న ప్రజలు



ఉష్ణోగ్రతల తాకిడికి నిర్మానుష్యంగా మారిన రహదారి



ఎండ వేడిమికి తలపై చీరకొంగు కప్పుకుని వెళుతున్న మహిళ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగర ప్రజలను ఎండలు తారెత్తిస్తున్నాయి. వేసవికాలం ముగిసిపోయి, రుతుపవనాలు దేశంలోకి, రాష్ట్రంలోకి వచ్చి నెల రోజులు దాటేస్తోంది. వర్షాకాలం ప్రవేశించి దాదాపు నెల రోజులు కావస్తున్నా నగరంలో పెద్దగా వానలు పడిన దాఖలాలు. అడపాదడపా వానలు పడినా వర్షాకాలం ప్రభావం కనిపించలేదు. ఈ నెల కాలంలో ఏలూరు నగరంలో వేళ్లపై లెక్కించదగినన్ని రోజులు మాత్రమే వానలు కురిసి మమ అనిపించాయి. అయితే ఉష్ణోగ్రతలు వేసవిని తలిపించేలా నమోదవుతున్నాయి.

వేసవిని తలిపించేలా ఉష్ణోగ్రతలు

గత వారం రోజులుగా ఏలూరు నగరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండడంతో మరోసారి వేసవి వచ్చిందని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా వేసవి కాలం నాలుగు నెలలు, వర్షాకాలం నాలుగు నెలలు, శీతాకాలం నాలుగు నెలలు ఉంటుంది. అయితే ఈ ఏడాది వానాకాలం నెల రోజుల్లోనే వెళ్లిపోయిందా అనే అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వానా కాలం వచ్చినా ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగంలో ఎటువంటి మార్పు రాలేదని, కూలింగ్ వాటర్ కోసం వెంపర్లాడాల్సివస్తుందని, కాసేపు బయటకు వెళితే ఎండ దెబ్బకు ఎప్పుడు ఏసీలోకి వెళదామా అనే ఆలోచన వస్తోందంటున్నారు. జ్యూస్‌లు, కూల్ డ్రింకులు, ఐస్ క్రీంలు వంటి పదార్థాలు, పానీయాల విక్రయాలు సైతం వేసవి మాదిరిగానే ఉన్నట్టు చెబుతున్నారు.

ఉక్కిరిబిక్కిరి

ఒక పక్క గత వారం రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతుండగా, మరో నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. వేసవి కాలం ముగిసిన తరువాత గత వారం రోజులుగా నగరంలో 34 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. శనివారం 36డిగ్రీలు నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తోంది. అయితే ఆది, సోమవారాల్లో కూడా 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతాయని, మంగళ, బుధవారాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీంతో ఇప్పుడప్పుడే వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడంలేదనే భావన ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

నగరంలో విచిత్ర వాతావరణం

నగరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విపరీతమైన ఎండలు కాస్తుండగా సాయంత్రం వాతావరణంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏక్షణాన అయినా కుండపోత వర్షం కురుస్తుందన్నట్టుగా దట్టమైన మబ్బులు పట్టడం కొంతసేపటికి పెద్ద ఎత్తున గాలి వీచి మబ్బులు తరలి వెళ్లిపోవడం ప్రజలు ఉసూరుమనడం గత కొన్ని రోజులుగా జరిగిపోతుంది. శనివారం ఉదయం భారీ వర్షం కురిసి రోడ్లన్నీ నీటితో మునిగిపోయాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగభగలాడుతూ దర్శనమిచ్చాడు. సాయంత్రం 6.30 గంటల వరకూ నగరంపై భానుడి ప్రతాపం కొనసాగింది. 6.30 గంటల తరువాత సూర్యుడు శాంతించినా వాతావరణంలో వేడి మాత్రం తగ్గలేదు. మధ్యాహ్నం ఎండ దాదాపు వేసవి వాతావరణాన్ని తలపించింది. మహిళలు తలపై కొంగులు, గొడుగులు కప్పుకుని రాకపోకలు సాగించారు. తప్పని పనులపై బయటకు వచ్చిన పురుషులు సైతం తొందరగా ఇళ్లకు చేరుకోవడానికి ప్రయత్నించారు. రెండో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు సెలవు కావడంతో పెద్దగా జన సంచారం లేకపోవడం, ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తరువాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

గోవుల సంరక్షణకు సమష్టి బాధ్యత



మునగాల మురళీకృష్ణ

దెందులూరు: గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏలూరు గో సంరక్షణ సమితి కార్యదర్శి మునగాల మురళీకృష్ణ అన్నారు. శనివారం దెందులూరు నియోజకవర్గం చాటపర్రు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు గో సంరక్షణ సమితి ఏర్పాటుచేసి 108 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ సమితి ఆధ్వర్యంలో చాటపర్రు, కొమడవోలు, కొప్పాక, ఏలూరు కేంద్రాల్లో 506 గోవులు ఉన్నాయని తెలిపారు. శాశ్వత గో పోషణకు దాతలు రూ.5 వేలు, అంతకన్నా ఎక్కువ ఇచ్చిన వారి పేరు రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు.